భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మే 30: భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో గురువారం రాములోరికి అర్చకులు నిత్య కల్యాణం జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవా కాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పీవీకే గని సమస్యలు పరిష్కరించాలి

రామవరం, మే 30 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే గనిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వట్టికొండ మల్లికార్జున్‌రావు, గట్టయ్య, నాగేశ్వరరావు, సందబోయిన శ్రీనివాస్, రాజేశ్వరరావు, రమేశ్ రాంచందర్, నారాయణ, దేవీసింగ్, శివ, భాస్కర్, డీవీ రమణ, కుమార్, కృష్ణ, రమణ, పరమేష్, శ్రీనివాస్, ఈశ్వరయ్య, సుమన్, గౌస్, విక్రం, కరన్నయ్య, లగ్గాల అజయ్, మనీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులకు రక్తదానం

రామవరం, మే 30 : అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి మదర్‌థెరిస్సా బ్లడ్ డోనర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఐదునెలల పిల్లవాడికి ప్లేట్‌లెట్స్ తక్కువ ఉన్నకారణంగా బీ పాజిటీవ్ రక్తం కావాలని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన ట్రస్టు సభ్యుడు అజయ్ అక్కడికి చేరుకొని రక్తం అందించారు. నాలుగేళ్ల బాలుడు సాకేత్‌కు కంటి సర్జరీ కోసం రక్తం కావాల్సి ఉండగా ట్రస్టు సభ్యుడు గూడెల్లి ముఖేష్ సకాలంలో స్పందించి రక్తం అందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారు 7559285431 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

భద్రాచలం, మే 30: మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలు వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం పీవో సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వరదలు వచ్చే ప్రమాదమున్నందున గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గిరిజనులతో వైద్య ఆరోగ్య శాఖాధికారులు గిరిజన గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా వరద ముంపు ఉన్న గ్రామాలను గుర్తించి, రిహ్యాబిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అందించే నిత్యావసర వస్తువులు, వైద్య సదుపాయం అందే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణలో రైతుల భాగస్వామ్యం

సారపాక, మే 30: పర్యావరణ పరిరక్షణలో రైతుల భాగస్వామ్యం ఎంతో ఉందని అగ్రికల్చర్ ఆఫీసర్ వైష్ణవి, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి సోమ్లా నాయక్, సొసైటీ డైరెక్టర్ కొండారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సారపాక రైతువేదికలో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు అదనపు ఆదాయంగా కార్బన్ క్రెడిట్ ప్రోత్సాహకాలను అందించే ఉద్దేశ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టు నమోదు చేసిన జీకే ఎఫ్ ఆగ్రోఫారెస్ట్రీ, క్లైమ్‌టెక్ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు సుబ్బారెడ్డి, గాదె నర్సిరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం బాలు, జీకేఎఫ్, క్లైమ్‌టెక్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బూర్గంపహాడ్, మే 30: ఉపాధిహామీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రఘును కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల కార్యదర్శి బయ్యా రాము, సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య, మడకం సోమయ్య, సూర్య ఉన్నారు.

బూర్గంపహాడ్ సీహెచ్‌సీకి ఫ్యాన్లు వితరణ

సారపాక, మే 30: బూర్గంపహాడ్‌లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లోవైద్యం కోసం వచ్చిన రోగుల సౌకర్యార్థం సారపాకకు చెందిన వ్యాపారి కన్నెదారి రమేశ్ మూడు ఫ్యాన్లు, పాత్రికేయులు మహ్మద్ అబ్దుల్ ఘని ఒక ఫ్యాను అందజేశారు. వీటిని ఆసుపత్రి వైద్యురాలు అనితకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది భాస్కర్, సురేశ్, హరి పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి

టేకులపల్లి, మే 30 : కేవోసీలో ఓబీ, కోల్ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి ఐతా శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో శ్రీరాములు ఆధ్వర్యంలో రాజ్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, సమ్మయ్య, రమేశ్, నర్సింహారావు, భద్రం, సక్రు, చారి, రామయ్య, మంగీలాల్, సెవిట్యా, లాలసింగ్, బాబులాల్, మాన్‌సింగ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అంజన్నకు రామన్న కానుకలు

భద్రాచలం, మే 30: కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆలయంలో శనివారం హనుమజ్జయంతిని పురస్కరంచుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున అంజన్నకు పట్టు వస్త్రాలు, స్వామివారికి ఇష్టమైన అప్పాల మాలలు, వడమాలలను భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి కొండగట్టు ఆలయ అర్చకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఏఈవో భవాని రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

మద్దుకూరు గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

చండ్రుగొండ, మే 30 : త్వరలో మద్దుకూరు గ్రామాన్ని సందర్శించి, గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో మద్దుకూరు గ్రామస్తులు, నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీనియర్ నాయకులు సుంద్రు విజయ్, మన్నె వీరేంద్ర, చింతల చందు, పెనుగొండ వెంకటేశ్వరరావు, ఎస్‌కె సమీర్ ఉన్నారు.

ముగిసిన వేసవి క్రీడాశిక్షణ శిబిరం

రామవరం, మే 30 : సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. రుద్రంపూర్ ఆర్‌సీపీవోఏ క్లబ్‌లో నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఏరియా జీఎం శాలెం రాజు పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థులకు ఏకరూప క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. గత నెల 26 నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరిగిన శిక్షణా శిబిరంలో అనుభవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ క్యాంపును నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, గౌరవ సెక్రటరీ డీవైపీఎం శ్రావణ్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ గట్టయ్య పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'హరితం...హతం'పై....
అటవీ శాఖ చర్యలు

- చెట్లు నరికిన ఇద్దరిపై కేసు నమోదు
- రూ.20 వేల కలప స్వాధీనం

'నమస్తే తెలంగాణ' పత్రికలో ప్రచురితమైక కథనం

అశ్వారావుపేట, మే 30 : పోడు భూమిలో భారీ వృక్షాల నరికివేతపై అటవీ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. పోడు పట్టాదారిణీతో పాటు చెట్టు నరికిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రూ.20 వేలు విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో పోడు వ్యవసాయం చేస్తున్న మడకం చంద్రమ్మకు పట్టా పాసు పుస్తకం జారీ చేసింది. ఈ భూమిలో భారీ వృక్షాలు ఉండడంతో గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు ఎటువంటి అనుమతులు లేకుండా ఇటీవల యంత్రాలతో తొలిగించారు. దీనిపై ఈ నెల 19వ తేదీన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'హరితం...హతం' శీర్షికన కథనం ప్రచురించింది. అందుకు స్పందించిన అటవీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. పోడు భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నరికిన నార వేప, తునికి, పాల, తిరుమాను జాతికి చెందిన చెట్లను గుర్తించారు. చెట్ల కొలతలను సేకరించి వాటి విలువను రూ.20,402లుగా నిర్ధారించారు. కలపను స్వాధీనం చేసుకున్నారు. చెట్లు నరికినందుకు పోడు పట్టాదారిణి చంద్రమ్మ, యంత్రాలతో చెట్లు నరికిన బత్తుల నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. కేసును కోర్టుకు పంపించినట్లు గురువారం ఫారెస్ట్ రేంజర్ మురళీ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. అయితే ఘటన జరిగి సుమారు 20 రోజులు దాటినా, 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శీర్షిక ప్రచురితమై 11 రోజుల గడిచినా, కేసు నమోదు చేసి 9 రోజులైనా వివరాలు గోప్యంగా ఉండడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ సిఫార్సులతోనే కేసు వివరాలు బహిర్గతం చేయండా రహస్యంగా ఉంచారనే అనుమానాలను వెలిబుచ్చుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

ఏవో రఘుదీపిక

జూలూరుపాడు, మే 30 : అధీకృత డీలర్లు రైతులకి నకిలీ విత్తనాలను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ శాఖాధికారి రఘుదీపిక హెచ్చరించారు. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా గురువారం విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న పత్తి విత్తనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన అనుమతుల పత్రాలను పరిశీలించారు. రైతులకు తప్పకుండా బిల్లులను ఇవ్వాలని, ఎంఆర్‌పీ కంటే ఎక్కువకి విక్రయిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. దుకాణాల్లో బ్లాక్ బోర్డుపై విత్తనాల కంపెనీ పేర్లు ధరలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. వారివెంట ఏఎస్సై తిరుపతిరావు, వ్యవసాయశాఖాధికారులు ఉన్నారు.

జూలూరుపాడులో తనిఖీ చేస్తున్న ఏవో రఘుదీపిక

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

అన్నపురెడ్డిపల్లి : విత్తనాలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

అన్నపురెడ్డిపల్లి, మే 30 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజ్‌కుమార్, ఏవో అనూష అన్నారు. గురువారం మండల కేంద్రంలో వ్యవసాయం, పోలీస్‌శాఖ అధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో, ఎస్సై మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. విత్తనాలకు రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

అశ్వారావుపేట, మే 30 : వ్యవసాయ సీజన్ ప్రారంభ దశలో రైతులకు అవసరమైన అన్నిరకాల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు అష్టల్ బేగం తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందస్తు సాగు ప్రణాళిక ఆధారంగా నియోజకవర్గ మండలాల్లో వరి 48వేలు, పత్తి 18వేలు, మిర్చి 2 వేలు, మొక్కజొన్న 5వేలు చొప్పున పంటలు సాగు కానున్నాయని, సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలను ప్రైవేట్ దుకాణాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సమావేశంలో ఏవో వై.నవీన్, పలువురు ఏఈవోలు పాల్గొన్నారు.

ధరల పట్టికను ప్రదర్శనలో ఉంచాలి

విలేకరులతో మాట్లాడుతున్న ఏడీఏ అష్టల్ బేగం

అశ్వారావుపేట, మే 30 : విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అష్టల్ బేగం, సీఐ జితేందర్‌రెడ్డి డీలర్లను హెచ్చరించారు. ధరలు, నిల్వల వివరాలు తెలియజేస్తూ ఎప్పటికప్పుడు దుకాణాల ఎదుట పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు తగిన రసీదులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రోజూ వారీ విక్రయాల వివరాలు అందించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వై.నవీన్ సూచించారు. ప్రభుత్వ లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి ఖచ్చితంగా రసీదులు తీసుకోవాలని చెప్పారు. మండలంలోని కోయ రంగాపురం, రామన్నగూడెం, దురదపాడు, మామిళ్ళవారిగూడెం గ్రామాల్లో గురువారం నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసీదులను పంట పూర్తి అయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయించేందుకు వస్తే సమాచారాన్ని వ్యవసాయ శాఖాధికారులకు అందించాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే అందుబాటులో ఉన్న ఏఈవోలు లేదా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు ఇవ్వాలి

పాల్వంచ, మే 30 : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందజేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అధికారులకు వినతిపత్రాలు అందించారు. జిల్లా నాయకుడు పూనెం రమేశ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురియడంతో రైతులందరికీ ఇప్పటికే దుక్కులు దున్నుకొని విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రాయబారపు వెంకటేశ్వర్లు, కుంజా రమేశ్, యలమంచి కోటయ్య, యల్లయ్య, లింగస్వామి, పుల్లయ్య, బాలు పాల్గొన్నారు.

జనజీవనంలో స్వేచ్ఛాయుతంగా బతకండి
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు

కొత్తగూడెం క్రైం, మే 30 : వనాన్ని వీడి జనంలోకి వచ్చి స్వేచ్ఛాయుతమై జీవితాన్ని గడిపేందుకు మావోయిస్టులు ముందడుగు వేయాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు పిలుపునిచ్చారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులకు గురువారం తన కార్యాలయంలో రివార్డులను అందజేశారు. మావోయిస్టులు కాలంచెల్లిన సిద్ధాంతాలను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయిన ఏటూరినాగారం–మహదేవపూర్ ఏరియా కమిటీ సభ్యుడైన కోవాసి గంగ అలియాస్ మహేష్ అలియాస్ జనార్దన్, అతడి భార్య సోడి ఉంగి అలియాస్ ఝాన్సీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రివార్డులను ఎస్పీ అందజేశారు. దంపతుల ఒకొక్కరిపై రూ.4 లక్షల రివార్డును అప్పుడు ప్రభుత్వం ప్రకటించింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి. సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, చర్ల సీఐ ఆలెం రాజు వర్మ, ఎస్సై రెడ్డెం నర్సిరెడ్డి పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి హత్య!

గుణదీప్ (ఫైల్), ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు

కొత్తగూడెం క్రైం, మే 30 : స్నేహితుడు, వేరే వ్యక్తికి మధ్య ఉన్న జరుగుతున్న కొట్లాటను ఆపేందుకు యత్నించిన బీటెక్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన కొత్తగూడెం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. పట్టణంలోని కూలీలైన్ ఏరియాకు చెందిన ఎల్లబోయిన గుణదీప్(21) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెలువలు కావడంతో కొత్తగూడెం ఇంటికి వచ్చాడు. గురువారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని వైన్‌షాపు వద్ద గుణదీప్ స్నేహితుడు, చుంచుపల్లి మండలానికి చెందిన కోటేశ్‌కి మధ్య వాగ్వాదం జరిగి పెను ఘర్షణకు దారి తీసింది. ఘర్షణను ఆపేందుకు మధ్యలో యత్నించిన గుణదీప్‌ను కోటేశ్ విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో గుణదీప్ కిందపడిపోగా చలనం లేకపోవడంతో కోటేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు గుణదీప్‌ను జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుణదీప్ మృతిచెందాడని తెలుసుకున్న కోటేశ్ ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించి పైరవీలకు తెరలేపినట్లు సమాచారం. గత 20రోజుల క్రితం గుణదీప్ స్నేహితుడు, కోటేశ్‌కు ఓ బార్ షాపు వద్ద జరిగిన ఘర్షణే ఈ హత్యకు దారి తీసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, ఎస్సైలు రవికుమార్, విజయలు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, మే 30 : నిద్రమత్తులో డాబాపై నుంచి కిందపడి చెంచు సరవయ్య(55) మృతిచెందిన ఘటన మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలానికి చెందిన సరవయ్య ఈ నెల 29వ తేదీన లక్ష్మీదేవిపల్లిలోని సోదరి ఇంటికి వచ్చాడు. రాత్రి డాబాపై పడుకున్నాడు. నిద్రమత్తులో డాబాపై నుంచి కిందపడి మృతిచెందాడు. గురువారం మృతుడి కుమారుడు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు పాల్వంచరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

లక్ష్మీదేవిపల్లి, మే 30 : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో యువకుడు అక్కడిక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని అనిశెట్టిపల్లి గ్రామం వద్ద చోటుచేసుకున్నది. పాల్వంచ గట్టాయిగూడెం గ్రామానికి చెందిన శెట్టి తరుణ్(22) తన స్నేహితులను కలిసేందుకు బైక్‌పై ఇల్లెందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనిశెట్టిపల్లి గ్రామం వద్ద వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడి తలకి తీవ్రగాయమైంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్ను లక్ష్మీదేవిపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల్లో మాత్రమే దుక్కులు దున్నాలి

జూలూరుపాడు, మే 30 : ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌వోఎఫ్‌ఆర్ హక్కు పత్రాలు ఉన్న భూముల్లో మాత్రమే ట్రాక్టర్ యజమానులు దుక్కులను దున్నాలని జూలూరుపాడు ఎఫ్ ఆర్‌వో ప్రసాదరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీప్రాంతాలకు సమీపంలో ఉన్న ట్రాక్టర్ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. హక్కుపత్రాలు కల్గి ఉన్న భూములకు ఆనుకొని ఉన్న అటవీభూములను ట్రాక్టర్ యజమానులు ఎట్టి పరిస్థితుల్లో దున్నవద్దని తెలిపారు. ఎవరైనా కొత్తపోడు భూముల్లో దుక్కులు దున్నితే కేసులు నమోదు చేయడంతోపాటు ట్రాక్టర్ సీజ్ చేస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా బోర్లు వేయడం, కరెంటు మోటార్లు అమర్చడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాక్టర్ యజమానులు, అటవీశాఖాధికారులు లక్ష్మీనర్సు, మల్లయ్య, సలీం, వెంకటేశ్వర్లు, కిషన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీఎం పర్సనల్‌కు సన్మానం

రామవరం, మే 30 : జీఎం పర్సనల్‌గా విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందనున్న జీఎం పర్సనల్ హనుమంతరావును కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాసూరి శంకర్, మేడిపల్లి కరుణాకర్, యాకయ్య, సాధిక్, షకీల్ బాషా, బోయిన విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి
అడిషనల్ డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

జూలూరుపాడు, మే 30 : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది కృషిచేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులు వారికి అందిస్తున్న వైద్యసేవలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని చూసించారు. అనంతరం వైద్యసిబ్బందికి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. వారి వెంట వైద్యులు వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన
బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్

కొత్తగూడెం అర్బన్, మే 30 : రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి ఉందన్నారు. వడ్ల కొనుగోళ్లలో కటింగ్ పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతులు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాల కోసం బారులు తీరాల్సి వస్తోందని, ప్రతి ఒక్క రైతుకు అందేలా చూడాలన్నారు. వెంటనే జిలుగు, పిల్లిపెసర, పెసర విత్తనాలు, కంది గింజలు అందించాలని కోరారు. సమావేశంలో వంగా రవిశంకర్, సందెల సందీప్, సమీర్, నన్ను తదితరులు పాల్గొన్నారు.

'సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలి'

కొత్తగూడెం అర్బన్, మే 30 : విద్యుత్‌రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐ